క్లుప్తంగా

వైభవంగా చంద్రశేఖర సరస్వతి జయంతి



అలంకరణలో కంచి పీఠాధిపతులు

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి 130వ జయంతి శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్థాపించిన కంచి పీఠాధిపతుల విగ్రహాలకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

నింద్ర: ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులపై ఎంఈఓ నారాయణ శనివారం క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండో విడతలో మంజూరైన పాఠశాలల్లో నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ గిరీష్, ఏపీఎం చంద్రకళ, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వరుడికి రుద్రాభిషేకం



పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామంలో బాలగురునాథీశ్వర స్వామికి పౌర్ణమి సందర్భంగా శనివారం రుద్రాభిషేకం, యాగశాల, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు యాగశాలకు కావలసిన పూజసామగ్రిని మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. వేదపండితులు నవగ్రహ హోమం, శాంతి హోమం వంటి యాగశాల పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. స్థానికులతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సైన్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు

కార్వేటినగరం: విద్యార్థులు చిన్నప్పటి నుంచే ప్రయోగాలపై ఆసక్తి పెంచుకోవాలని సైన్స్ ఉపాధ్యాయురాలు వరలక్ష్మి అన్నారు. శనివారం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు సైన్స్ ఆవశ్యకతను వివరించారు. అదేవిధంగా మనం పీల్చే గాలిని ఎలా తయారు చేసుకోవాలో ప్రయోగాత్మకంగా చూపించారు. సున్నితపు త్రాసుతో బరువులను ఏ విధంగా తూకాలు వేయాలో తెలియజేశారు. అనంతరం బయోలజికల్ ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ సీతాకోకచిలుకలో వచ్చే వివిధ రకాల మార్పుల గురించి వివరించారు. అదేవిధంగా చెట్లు కార్బన్‌డయాక్సైడ్ పీల్చుకుని, ఆక్సిజన్ విడుదల చేసే విధానాన్ని వివరిస్తూ, చెట్ల వల్ల కలిగే లాభాలను తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు కంపెనీ బస్సు-లారీ ఢీ



వడమాలపేట : రేణిగుంట ఎయిర్‌పోర్టు స మీపంలో ఉన్న డిక్సన్ కంపెనీకి చెందిన బస్సు పుత్తూరు వెళ్తుండగా ముందుకు వెళ్తుతున్న లారీని నుంచి ఢీకొన్న ఘటనలో శనివారం వెలుగు చూసింది. బస్సుడ్రైవర్‌కు గాయాలైన సంఘటన మండలంలోని తడుకు ఆర్‌ఎస్ జంక్షన్ వద్ద శనివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని తడుకు ఆర్‌ఎస్ జంక్షన్ వద్ద కడప నుంచి చెన్నై వెళ్తున్న లారీని డిక్సన్ కంపెనీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో డ్రైవర్ నాగరాజుకు గాయాల య్యాయి. వెంటనే 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చెంచులక్ష్మి అమ్మవారి తిరునాళ్ల



విశేష అలంకరణలో అమ్మవారు

నింద్ర: మండలంలోని అత్తూరు పంచాయతీ ఎస్టీ కాలనీలో వెలసిన చెంచులక్ష్మి అమ్మవారి తిరునాళ్ల వేడుకలు ఘనంగా జరిగాయి. తిరునాళ్లలో భాగంగా రెండవ రోజు శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్ల ఆదివారం ముగుస్తుందన్నారు. ఆదివారం అమ్మవారికి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మునికన్నయ్య, ఆర్ముగం, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సాయం, సంక్షేమ పథకాలు తోడవడంతో అన్నదాత ఇంట ఆనందాల పంట పండుతోంది. సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందుతోంది. పైసా ప్రీమియం చెల్లించకుండానే పంటలకు బీమా సదుపాయం లభిస్తోంది. ఉన్న ఊర్లోనే వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలు అందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు చేసి సరికొత్త విప్లవాత్మక మార్పునకు నాంది పలికారు సీఎం జగన్‌మోహన్ రెడ్డి.

రైతుకు భరోసా



విజయపురం రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు అందుకొంటున్న రైతులు

- గ్రామాల్లో అన్నదాతలకు బాసటగా రైతు భరోసా కేంద్రాలు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు
- ఈక్రాప్ బుకింగ్‌తో బీమా సదుపాయం
- రైతన్నలకు తగ్గిన రవాణా చార్జీలు, ప్రయాణ ఖర్చులు
- ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తున్న సర్కారు
- ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన వారికి 21 రోజుల్లోనే పరిహారం అందజేత

పంటకు భరోసా..



మా గ్రామంలో చాలా మంది వరి, వేరుశనగ పంటలు సాగు చేశారు. వర్షాలు, కరువు కాటకాల వల్ల రైతులు సాగు చేసిన పంటలు నష్టపోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా రైతు భరోసా కేంద్రంలోకి వెళ్లి వరి పంటకు ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్నాం. సాగు చేసిన పంట నష్టం వాటిల్లకుండా ఉండేందుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందనే నమ్మకం, భరోసాను రైతు భరోసా కేంద్రం కల్పించింది.

– భాస్కర్‌రెడ్డి, కలియంబాకం, రైతు

8వేల మందికి ఉపయోగం..



విజయపురం మండలంలో మొత్తం రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా 8 వేల మంది రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నాం. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను ఆర్‌బీకేల ద్వారా గ్రామాల్లోనే పంపిణీ చేస్తున్నాం. గతంలో మాదిరిగా రైతులు నెలల తరబడి మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా స్వగ్రామాల్లోనే వ్యవసాయానికి కావాల్సిన పనులన్నీ వారి ఇంటికి సమీపంలోనే ఉంది.

– రజనికుమారి, విజయపురం ఏఓ

విజయపురం/పాలసముద్రం : గతంలో పంటల సాగు చేపట్టడానికి అన్నదాతలు ఎన్నో వ్యయప్రయాసలు పడేవారు. మందులు, ఎరువులు, విత్తనాలు తదితర వాటిని కొనేందుకు మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు పెట్టేవారు. ప్రభుత్వం నుంచి సాయం కావాలంటే అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. విత్తనాలు, క్రిమిసంహారణ మందులు ఇలా సాగుకు అవసరమైన వాటి కోసం ఆటోలు, వ్యాన్లను బాడుగకు వెంట పెట్టుకుని పట్టణాలకు వెళ్లేవారు. 2019 నుంచి రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. రాష్ట్రప్రభుత్వం ప్రతి పంచాయతీలో రైతులకు అందుబాటులో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. తద్వారా వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాల దగ్గర నుంచి పండించిన ధాన్యాన్ని విక్రయించే వరకు ఆర్బీకేల ద్వారానే సహాయం అందుతోంది. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్ బుకింగ్ చేసి ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం, రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించడం, పొలంబడి ద్వారా రైతులకు శిక్షణ, ఇలా ఎన్నో సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఆర్బీకేలు తమకు వరంలా మారాయని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విజయపురం మండలంలో మొత్త 12 ఆర్బీకే ద్వారా 8వేల మంది రైతులకు సేవలందిస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయంతో పాటు ఉద్యాన, ఫిషరీష్, పట్టుపరిశ్రమ శాఖ, ఏపీఎంఐపీ తదితర రంగాలకు సంబంధించిన సేవలన్నీ అందుతున్నాయి. దీనికితోడు రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనప్పుడు ప్రభుత్వమే ఆర్బీకే సిబ్బంది ద్వారా కొనుగోలు చేయించి కర్షకులకు బాసటగా నిలుస్తోంది.

ధాన్యం కొనుగోలుతో ఊరట

ప్రభుత్వం రైతులకు ఉచితంగా పంటల బీమా సదుపాయం కల్పించడం పెద్ద ఊరటనిస్తోంది. టీడీపీ హయాంలో బీమా మొత్తాన్ని 2 నుంచి 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి వచ్చేది. అయినప్పటికీ పరిహారం తూతూమంత్రంగా వచ్చేది. ప్రస్తుతం నోటిపై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు వైఎస్సార్ ఉచిత పంటల బీమా అందుతోంది. రైతులు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకపోయినా ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇస్తుంది.



పన్నూరు ఆర్‌బీకేలో రైతుకు రొటావేటర్ పంపిణీ చేస్తున్న అధికారులు



ఎస్‌కేఆర్ పురంలో రైతు భరోసా అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న ఢిల్లీప్రసాద్, ఏఓ

ఇందులోనే ఎరువులు..



గతంలో పంటల సాగు సమయంలో అవసరమయ్యే ఎరువులను కొనుగోలు చేసేందుకు విజయపురం, నగరిలోని దుకాణాల చుట్టూ తిరిగేవాణ్ణి. ప్రస్తుతం పన్నూరులోనే ఉన్న రైతు భరోసా కేంద్రంలో పంటల సాగుకు అవసరమైన యూరియా, డీఏపీ, 20:20 ఎరువులను పంటలకు వేస్తున్నా. ఆర్బీకేల వల్ల ఎరువుల కోసం పట్టణాలకు వెళ్లే ఇబ్బంది తప్పింది.

– పాండియన్, కాళికాపురం, రైతు

అందుబాటులో యంత్ర పరికరాలు



ఒకప్పుడు వ్యవసాయ పరికరాల కోసం పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేవి. ఇటీవల నేను కంది, వరి, వేరుశనగ పంటలు సాగు చేశాను. ఆ సమయంలో పొలం దున్ని సాగు చేయడానికి కావాల్సిన నాగలి, గొర్రు, రొటావేటర్ ఇలా అన్ని యంత్రాలు కూడా మా గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో తీసుకుని వ్యవసాయం చేశాను. – కుమార్‌రెడ్డి, అలపాకం, రైతు

వ్యవసాయం పండుగ అవుతోంది..



ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు అన్నిచర్యలు తీసుకుంటోంది. గతంలో వరుస కరువుతో రైతులంతా అల్లాడిపోయాం. ఈ నాలుగేళ్లుగా వర్షాలు బాగా పడుతున్నాయి. ప్రభుత్వం కూడా ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది. రూపాయి ఖర్చు లేకుండా ఉచిత పంట బీమా సదుపాయం కల్పిస్తోంది. గ్రామాల వారీగా కస్టమ్స్ హియరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి యాంత్రీకరణను అందుబాటులోకి తెచ్చింది.

– అమ్ములు, శ్రీకావేరిరాజుపురం

అర్హులందరికీ సాయం..



మండలంలో వైఎస్సార్ రైతు భరోసాకు సంబంధించిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనేది ప్రభుత్వ లక్ష్యం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్బీకేలలో అర్హులు ఉన్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ)లను సంప్రదించి దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి అర్హత ఉన్న వారికి కూడా రైతు భరోసా నగదు పడింది.

– ఢిల్లీప్రసాద్, ఏఓ, పాలసముద్రం

శివప్రసాద్ కుటుంబానికి ఆర్థికసాయం

- వైఎస్సార్ బీమా ద్వారా రూ.1 లక్ష
- రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థికసాయం



శివప్రసాద్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

వడమాలపేట : మండల పరిధిలోని కదిరిమంగళం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శివప్రసాద్ అనారోగ్యంతో గత ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి శనివారం శివప్రసాద్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా ద్వారా రూ.1 లక్ష, రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థికసాయం, ఇంటి స్థలం పట్టాను అందించారు. భవిష్యత్‌లో కూడా పార్టీ తరపున అన్నివిధాలా అండగా ఉంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు మంజుల, ధర్మయ్య, డీసీసీబీ బ్యాంకు డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, కాయం సింగిల్‌విండో అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, నాయకులు సదాశివయ్య, సురేష్‌రాజు, మునిబాబు, నందయ్య, వెంకటరెడ్డి, వేణు, సుధాకర్‌రెడ్డి అయ్యప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

కార్వేటినగరం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో పేదలకు ఇచ్చిన ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో గృహ నిర్మాణాలపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన పక్కాగృహాలను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు వలంటీర్లు ఇంటి నిర్మాణం పూర్తిపై అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం హౌసింగ్ ఏఈ యోగేంద్రనాయుడు మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు కూడా చెల్లించాల్సిన బిల్లులు ఇవ్వడానికి కృషి చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు బిల్లులపై అపోహలు వీడాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల పూర్తి చేసి జులై నెలలో జరిగే సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, ఈఓఎన్ఎస్ మణి, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పాలసముద్రం : రైతుల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తోందని ఎంపీడీఓ శ్రీనివాసన్, ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. శనివారం తిరుమళరాజుపురం, నరసింహపురం రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అన్నదాతలకు రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందిస్తోందని తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను సబ్సిడీతో అందిస్తున్నామని చెప్పారు. అలాగే పంట చేతికి వచ్చేవరకు రైతులకు సహాయ సహకారాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా మండల పరిధిలో నాలుగేళ్లలో రైతులకు మాత్రం పలు సంక్షేమ పథకంలో సుమారు రూ.19 కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. వ్యవసాయ సహాయకులు నెడుంజేలన్, సూర్య, శంకర్, పంచాయతీ కార్యదర్శి హరి, రైతులు పాల్గొన్నారు

విద్యాకానుక కిట్ల పరిశీలన

నగరి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను ఎంఈఓ శ్రీదేవి, మండల ఇంజినీరు శైలేంద్రతో కలిసి శనివారం పరిశీలించారు. యూనిఫాం, షూ, బెల్టు, పుస్తకాలు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో జేవీకే ఇన్‌చార్జ్‌లు, కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

హనుమంతస్వామికి పూజలు



విజయపురం (నగరి): మండలంలోని కోసలనగరం గ్రామంలో వెలసిన శ్రీ హనుమంత స్వామివారి ఊరేగింపు శనివారం వైభవంగా జరిగింది. ఆలయంలో స్వామివారికి అర్చకులు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఏటా తమిళ వయ్యాసి నెల పౌర్ణమి రోజున ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

వైభవంగా అభిషేక పూజలు

మండలంలోని నారపరాజుకండ్రిగలో వెలసిన శ్రీ ప్రసన్న వరసిద్ధి వినాయకుడి ఆలయంలో శనివారం అర్చకులు మండల అభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఎలక్ట్రిక్ అసోసియేషన్ సభ్యులకు జీవిత బీమా

నగరి : స్థానిక ఎలక్ట్రిక్ అసోసియేషన్ సభ్యులకు కార్యవర్గ సభ్యులు పోస్టాఫీస్ ద్వారా రూ.10 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించారు. శనివారం అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, కార్యదర్శి ఇంద్రయ్య సభ్యులందరికీ పోస్టాఫీస్ ద్వారా జీవిత బీమా చేయించి సంబంధిత పత్రాలను వారికి అందజేశారు. అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకోని వారు కూడా అసోసియేషన్‌లో చేరి అన్నిరకాల సదుపాయాలను పొందాలని ఈ సందర్భంగా వారు కోరారు.

సింహాచలం అప్పన్న సేవలో డిప్యూటీ సీఎం



మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు

కార్వేటినగరం: ప్రముఖ ప్రసిద్ధి చెందిన క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ సింహాచల అప్పన్నను శనివారం ఉదయం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు పూర్ణకుంభంతో మంత్రులకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం మంత్రులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగనన్నే కొనసాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



పురవీధుల్లో విహరిస్తున్న గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి

పుత్తూరు రూరల్: పట్టణంలో వెలసిన శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు కలశ పూజ, నవగ్రహ, సుదర్శన, మృత్యుంజయ, గాయత్రి, మూలవిరాట్ హోమాలు జరిపించారు. పరివార దేవతలకు అభిషేకాలు, మహాపూర్ణాహుతి చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు స్వామి, అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో అలంకరించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటా కర్పూర హారతులను అందుకున్న స్వామివారు భక్తులను కటాక్షించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



విజయపురంలో సైకిల్ తొక్కుతున్న వైద్యసిబ్బంది

విజయపురం (నగరి) : సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి అంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. శనివారం జాతీయ సైకిల్ డే పురస్కరించుకుని మండల కేంద్రంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండు నుంచి మండల కార్యాలయం వరకు వైద్య సిబ్బంది, విద్యార్థులు సైకిల్ తొక్కారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏటా జూన్ మూడో తేదీన ప్రపంచవ్యాప్తంగా సైకిల్ డేని జరుపుకుంటామన్నారు. సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. రోజూ క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం వల్ల శరీర కండరాలు పరిపుష్టిగా తయారవుతాయని తెలిపారు. అంతేగాకుండా రక్త ప్రసరణ సజావుగా సాగుతుందని, శరీరం కాస్త అలసటకు గురై ఆకలి, నిద్ర పెరుగుతుందన్నారు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు. ప్రధానంగా గుండె జబ్బులు, క్యాన్సర్, షుగర్ వంటి వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్బరామమ్మ, ఎంపీహెచ్‌ఓ అన్నపూర్ణమ్మ, సూపర్‌వైజర్ మురళి, చింతామణి, ఏఎన్‌ఎం శాంతి, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మల్లారెడ్డికండ్రిగలో వైద్యశిబిరం



మల్లారెడ్డికండ్రిగ గ్రామస్తులతో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ రవిరాజు



రాంప్రసాద్ రెడ్డితో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ

విజయపురం (నగరి) : వైరల్ ఫీవర్ తగ్గినా ఒకటి, రెండు రోజులు ఒళ్లు, కీళ్ల నొప్పులు ఉంటాయని, అందుకు భయపడాల్సిన అవసరం లేదని చిత్తూరు అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ రవిరాజు అన్నారు. గత 15 రోజులుగా మల్లారెడ్డికండ్రిగలో జ్వరాలు తగ్గకపోవడంతో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ రవిరాజు శనివారం మల్లారెడ్డికండ్రిగలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలోని రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ రవిరాజు గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఎక్కువ రోజులు జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్తనమూనాలు సేకరించారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాలు అదుపులో ఉన్నాయని, వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న వారిలో ఒకటి, రెండు రోజుల్లో ఒళ్లు, కీళ్లనొప్పులు ఉంటాయని, ఆ తరువాత తగ్గుతుందని భయపడాల్సిన అవసరం లేదన్నారు. అత్యవసరమైతే 108 అందుబాటులో ఉంచి, ఫీవర్ పూర్తిగా తగ్గే వరకు వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని విజయపురం డాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

దోమకాటు వల్లే..

మంచినీళ్లలో పెరిగే దోమలు కుట్టడం వల్లే డెంగీ, చికెన్ గున్యా, వైరల్ ఫీవర్ వస్తుందన్నారు. అందుకే ప్రతిరోజు నీటిని తోడేసి, కొత్త నీటిని వాడాలన్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పాటించాలన్నారు. మంచి నీటిని వేడి చేసి చల్లార్చిన నీటి తీసుకోవాలన్నారు. రాత్రి పూట దోమతెర వాడాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే స్థానిక ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ విష్ణుప్రియ, సీహెచ్ఓ సుబ్బరామమ్మ, పీహెచ్‌ఎన్ అన్నపూర్ణమ్మ, సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులతో జాగ్రత్త



సంఘంటన స్థలాన్ని పరిశీలిస్తున్న కార్వేటినగరం సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ షెక్షావలి

శ్రీరంగరాజపురం: దోపిడీ దొంగల ముఠా మండలంలోకి చొరబడిందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మండలంలోని మెదవాడ గ్రామం చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి పక్కన ఉన్న జి.సుబ్రమణ్యం కుమారుడు రామ్మూర్తి నాయుడు ఇంటిలోకి గుర్తు తెలియని దొంగలు మాస్కులు ధరించి శుక్రవారం రాత్రి 4 గంటల సమయంలో ఇంటి తలుపులను గడ్డపారతో బలంగా కొట్టారు. అయితే తలుపులు తెరుచుకోకపోవడంతో ఇంటి తలుపుపై పెట్రోల్ పోసి అంటించగా, అటుగా వెళ్తున్న వారు చూడడంతో దొంగలు పరారయ్యారు. రామ్మూర్తినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్వేటినగరం సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ షెక్షావలి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న సీసీటీవీ పుటేజీ ద్వారా దొంగలను గుర్తించి త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ షెక్షావలి మాట్లాడుతూ ఎవరైన అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ 9440900692 నంబర్‌కు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.